క్లుప్తంగా

బాలికల చదువు, బాల్య వివాహాలపై కళాజాత



బాలికల చదువుపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు గాంధీనగర్‌-1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 'బేటీ బజావో–బేటీ పడావో' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికల చదువు, బాల్య వివాహాలపై కళాజాత బృందం సభ్యులు నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఆడ పిల్లలను చదివించాలని, మధ్యలో చదువు మాన్పించకూడదని, ఆడ పిల్లలను రక్షించుకోవాలని భావంతో ప్రదర్శించిన నాటిక ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో సీడీపీవో మణికుమారి, సూపర్‌వైజర్ సుందరి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ లలితదేవి, అంగన్‌వాడీ వర్కర్లు శ్యామల, ఆశా వర్కర్లు జయ, ఆశా జ్యోతి, ఏఎన్ఎం సరళ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పీవీ చలపతిరావుకు ఘన నివాళి



చలపతిరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: బీజేపీ సీనియర్ నాయకుడు, దివంగత నేత పీవీ చలపతిరావు జయంతి వేడుకలు బీజేపీ నగర శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్రతో పాటు పలువురు నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని చలపతిరావు చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి చలపతిరావు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బుద్ధా లక్ష్మీనారాయణ, నడుపూరు సన్యాసిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అగ్నిపథ్'ను రద్దు చేయాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఏఐవైఎఫ్ నాయకులు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ నాయకులు పాతగాజువాక జంక్షన్‌లో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు మాట్లాడుతూ అగ్ని పథ్ ద్వారా చేపట్టిన నియామకాల్లో ఉద్యోగం కేవలం నాలుగేళ్లు మాత్రమే ఉంటుందన్నారు. అగ్నిపథ్ ద్వారా ఉద్యోగాల్లో చేరిన యువత తర్వాత నిరుద్యోగులుగా మారుతారన్నారు. దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకుడు

సీతంపేట: స్వర సంగమం(హైదరాబాద్), స్వర మాధుర్యం(వైజాగ్) సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంస్థ అధ్యక్షుడు డి.ఎం.రావు, కార్యదర్శి పి.వి.రఘుపతి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. గాయనీ గాయకులు ఆనందరెడ్డి, సంపత్‌కుమార్, శ్రియ, శశిరాణి, శైలజ మెరాజ్, మాధవి అద్భుతంగా పాటలు పాడి శ్రోతలను మెప్పించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటే భవిష్యత్ పదిలం



కృష్ణా కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సంలో సివిల్ జడ్జి శేషమ్మ, అధ్యాపకులు



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, విశ్రాంత న్యాయమూర్తి పైలా సన్నిబాబు, డీఈవో చంద్రకళ, పోలీస్ అధికారులు

ఏయూ క్యాంపస్: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండి, తమ భవిష్యత్తును పదిలపరుచుకోవాలని విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఒడిశా స్టీవ్‌డోర్స్ లిమిటెడ్, హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈస్ట్ పాయింట్ కాలనీ కేడీపీఎం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. విశ్రాంత న్యాయమూర్తి పైలా సన్నిబాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల ఉజ్వలమైన భవిత నాశనం అవుతుందన్నారు. శారీరకంగా, మానసికంగా వ్యక్తి బలహీనంగా మారడానికి మాదకద్రవ్యాలు కారణంగా చెప్పొచ్చన్నారు. మంచి జీవన శైలి, చక్కని ఆరోగ్య అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. ఉన్నతంగా రాణించాలనే లక్ష్యాన్ని ఏర్పరుచుకుని చుట్టూ ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఎదగాలన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శనం, పెద్దల సూచనలు వ్యక్తి అభ్యున్నతికి ఉపకరిస్తాయన్నారు. తల్లిదండ్రుల ఆశయాల వారసులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. జైళ్ల సూపరింటెండెంట్ ఎస్.కిషోర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను వినియోగించడం చట్టరీత్యా నేరమన్నారు. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, పిల్లలపై తగిన పర్యవేక్షణ లోపించడం కూడా యువత పెడదారి పట్టడానికి కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. చిన్నారుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు అధ్యాపకులు గమనిస్తూ మార్గదర్శనం చేయాలని సూచించారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించడం, బాధ్యతాయుత పౌరులుగా చిన్నారులను తీర్చిదిద్దడం మన లక్ష్యమన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై నిపుణులతో అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పార్థసారథి, హిమ సంస్థ అధ్యక్షుడు శరగడం సురేష్, వ్యవస్థాపక జనరల్ సెక్రటరీ టి.వి.డి.దాస్, పాఠశాల హెచ్ఎం సుమతి భాయి, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థి దశలో నేరాలకు అదే కారణం'

ఆరిలోవ: మాదక ద్రవ్యాలు వాడకం వల్లే విద్యార్థి దశ నుంచే నేరాలు పెరుగుతున్నాయని జిల్లా లీగల్ సెల్ అథారిటీ చైర్‌పర్సన్ వెంకట శేషమ్మ తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం–అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడుతూ విద్యార్థి దశలో చేస్తున్న నేరాలు, వాటికి కోర్టులు విధిస్తున్న శిక్షలు, విద్యార్థుల పట్ల లైంగిక వేధింపులు గురించి అవగాహన కల్పించారు. బాలికలు పాఠశాలల నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు, బస్సుల్లో ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆర్జేడీ బి.విజయభాస్కర్ మాట్లాడుతూ పిల్లలు మత్తు పదార్థాలకు ఏవిధంగా అలవాటు పడుతున్నారో వివరించారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సువర్ణ, హెచ్ఎం జి.కె.డి. భవాని, ఉపాధ్యాయులు కృష్ణారావు, చంద్రాజీ, కిరణ్, శ్రీనివాసరావు, చంద్రబాబునాయుడు, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.



తోటగరువు హైస్కూల్‌లో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్ వెంకట శేషమ్మ

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

మద్దిలపాలెం : మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని, ఉన్నత లక్ష్యాలతో విద్యలో రాణించి ఉజ్వల భవిష్యత్తు సాకారం చేసుకోవాలని జిల్లా సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ శేషమ్మ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్య పట్ల శ్రద్ధ పెడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ టి.వి.ఎ.నాయుడు మాట్లాడుతూ గంజాయి, పొగాకు, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాల వినియోగం చట్ట రీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజంలో లింగ సమానత్వం అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిపుణుడు శివ

ఏయూ క్యాంపస్: సమాజంలో లింగ సమానత్వం ఎంతో అవసరమని ఎల్‌పీఎస్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ చప్పా అన్నారు. ఎల్‌పీఎస్ చారిటబుల్ ట్రస్ట్, నేస్తం సోషిక్స్ సంయుక్తంగా ఏయూ తెలుగు మాధ్యమం పాఠశాల విద్యార్థులకు రెండు రోజుల అవగాహన సదస్సు నిర్వహించారు. లింగ సమానత్వం, ఎల్‌జీబీటీక్యూఐఏ హక్కులు, మానవ హక్కులు, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. 8 నుంచి 10వ తరగతికి చెందిన 200 మంది విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలకు తమ సంస్థ తరపున నిర్వహిస్తామన్నారు. జన్మతహ వచ్చిన జెండర్‌ను కొనసాగించడం, సమాజంతో అందరితో సమానంగా జీవించడం ఎంతో అవసరమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సలోమి మాట్లాడుతూ ఎంతో సున్నితమైన అంశంపై నిపుణులు విస్తృత అవగాహన కల్పించారన్నారు. జెండర్ స్టడీస్ నిపుణుడు శివ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా సమాజంలోని వివిధ వ్యక్తులు, వారి మధ్య లింగ సమానత్వం, వారి హక్కులను తెలుసుకుంటూ పరస్పరం గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు.

రహదారులు జలమయం



పెదగదిలి వద్ద నిలిచిన వరద నీటిలో వాహనాల రాకపోకలు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలిలో మళ్లీ వరద నీరు చేరింది. చిన్నపాటి వర్షానికి సైతం ఈ కూడలి జలమయమవుతుంది. సాయంత్రం కురిసిన వర్షానికి పెదగదిలి కొండవాలు నుంచి ఇక్కడికి చేరిన వరద నీరు నిలిచిపోయింది. గంటల తరబడి నిలిచిన మోకాలు లోతు నీటిలో వాహనచోదకులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం పడినప్పుడల్లా ఇక్కడ ఇదే పరిస్థితి ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదగదిలి కొండవాలు నుంచి కాలువల ద్వారా వచ్చిన వరద నీరు వెంటనే కిందకు ప్రవహించడానికి వీలుగా సరైన డ్రైనేజీ విధానం లేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ఇక్కడ గంటల తరబడి నీరు నిలిచిపోతోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న ఇసుకతోట రోడ్డు

మద్దిలపాలెం: ఇసుకతోట, మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, శివాజీపాలెం రోడ్డు, పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. సుమారు గంట పాటు కురిసిన వర్షంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లు చెరువును తలపించాయి. కాసేపు జన జీవనం స్తంభించిపోయింది.

జీవితానుభవాల నుంచే కథలు



మాట్లాడుతున్న రచయిత సుగుణరావు

సీతంపేట: రచయితకు సాంఘిక బాధ్యత ఉండాలని రచయిత డాక్టర్ ఎం.సుగుణరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీలో వైవిధ్య భరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలనేవి ఆకాశంలోంచి ఊడిపడవని, జీవితానుభవాలే కథలకు ముడిసరుకని పేర్కొన్నారు. కథా వస్తువు కోసం జీవితాన్ని, శైలి కోసం సాహిత్యాన్ని చదవాలని సూచించారు. నడుస్తున్న చరిత్రను రికార్డు చేసే సాంఘిక బాధ్యత రచయితకు ఉండాలన్నారు. పీడిత, తాడిత, దళిత, బహుజన, మహిళావాద దృష్టి కోణం నేపథ్యంలో వచ్చిన వందలాది కథలను అధ్యయనం చేసిన తర్వాతే ఔత్సాహిక రచయితలు కలం పట్టాలన్నారు. రాజకీయ సామాజిక అంశాలు, సమస్యలను ఆకలింపు చేసుకుని నిబద్ధతగా రాసే ప్రతి రచయిత మంచి సృజనకారుడు అవుతాడని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ జీవితం నుంచే కథానికలు వస్తాయని, కథాశిల్పం సరిగా లేకపోతే కథనం దెబ్బతింటుందన్నారు. సిహెచ్.చిన సూర్యనారాయణ, ఎస్.విజయ్‌కుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, కె.వి.ఎస్.మూర్తి, పీవీఆర్ కుమారరావు, పరమేశ్వరరావు, రాధారాణి, సురేష్ తదితరులు కథా పఠనం చేశారు.

ఏయూ విద్యా విభాగానికి ఏసీ బహూకరణ



ఏసీ పత్రాలు వీసీ ప్రసాదరెడ్డికి అందిస్తున్న గణపతిరాజు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగానికి నగరానికి చెందిన డాక్టర్ డి.వి.గణపతిరాజు రూ.35 వేలు విలువైన ఏసీని బహూకరించారు. ఈ మేరకు బుధవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని తన కార్యాలయంలో కలిసి ఏసీ పత్రాలు అందజేశారు. ఏయూ పూర్వ విద్యార్థిగా విభాగానికి తనవంతు సహకారాన్ని అందిస్తున్నానని గణపతిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో సౌకర్యాల కల్పనపై లేఖ

ఎంవీపీ కాలనీ: తిరుమలలో శ్రీవారి భక్తుల కోసం అక్షరధామం పేరుతో ధార్మిక సముదాయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు పలు రకాల సౌకర్యాలు కల్పించాలని కోరుతూ విశాఖ సాగర తీర కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు టీటీడీ ఈవో శ్యామలరావుకు లేఖ రాశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్యూలైన్‌లో భక్తులకు ప్రవచనాలు, హరికథలు, సంకీర్తనలు వినిపించేలా ప్రత్యేక ప్రోగ్రామ్‌లు నిర్వహించాలని కోరారు. దర్శనం నిమిత్తం వచ్చి వెయింట్ రూమ్స్‌లో ఉండే భక్తుల పిల్లలకు ఆధ్యాత్మికంగా పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించాలన్నారు. ఇందుకు అనుగుణంగా విశాఖ సాగర తీర కార్తీక దీపోత్సవ కమిటీ సహకారం అందిస్తుందని కమిటీ సభ్యులు రాజేష్, హిమాన్షు ప్రసాద్ లేఖలో పేర్కొన్నారు.

ఆకట్టుకున్న భక్త నత్కీర నాటక ప్రదర్శన



నాటకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి

సీతంపేట: శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రంగస్థల కళాకారుడు, పలు నంది పురస్కారాల గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి బృందం ప్రదర్శించిన భక్త నత్కీర నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీకాళహస్తి మహత్స్యం కావ్యం ఆధారంగా మీగడ రామలింగస్వామి రచించిన ఈ నాటకంలో ఆయన నత్కీరుడు పాత్ర అద్భుతంగా పోషించారు. పాండ్య రాజుగా వి.సత్యం, నారదుడిగా డాక్టర్ అత్తిలి శంకర్, హరద్విజుడుగా ధూపం గురుమూర్తి, మహామంత్రి కె.గోపినాయుడు, మహాశివుడుగా జి.సూర్యనారాయణ, బాల శివభక్తులుగా హనీష్, సహస్ర, దాసరిగా రుద్రనారాయణ, బుడత కీచకుడిగా డాక్టర్ మోహనరావు, రాజనర్తకిగా ఎన్.సరస్వతి తదితరులు చక్కని నటనతో రసోచితమైన పద్య పఠనంతో ఆద్యంతం ప్రేక్షకులను సమ్మోహనపరిచారు. వీరికి హార్మోనియంపై మీగడ మల్లికార్జున స్వామి, డోలక్‌పై కె.బాలకృష్ణ వాద్య సహకారం అందించారు. అలంకరణ, ఆహార్యం మీరా, సత్యం చేశారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరిగిన నాటక ప్రదర్శనను పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముగిసిన దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌లో కొలువుదీరిన విజయదుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్ని అమ్మవారికి విశేష పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కూరగాయల పెంపకంపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

సీతమ్మధార: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం సీతమ్మధార రైతుబజారులో కూరగాయల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పందిరి కూరగాయల సాగు, వేసవిలో పెంపకం, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కూరగాయల పెంపకం, మల్చింగ్ పద్ధతిలో కూరగాయుల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సాగుపై రాయితీల కోసం వివరించారు. పందిరి మీద కూరగాయలు పెంచడం వల్ల లాభాలు వస్తాయన్నారు. కూరగాయల విత్తనాలు కొనేటప్పుడు క్యాష్ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. వారికి ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఆధార్ కార్డు, వన్ బీ కాపీ, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ రైతు భరోసా కేంద్రంలో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్.కె.యాసిన్, ఉద్యానవన అధికారి జి.సోని, రైతుబజార్ ఈవో పి.కొండబాబు, సహాయకుడు కె.సతీష్, రైతులు పాల్గొన్నారు.

కిటకిటలాడుతున్న కేజీహెచ్

మందుల కౌంటర్ల వద్ద రద్దీ విపరీతం



కేజీహెచ్‌లో మందులు ఇచ్చే గది వద్ద రద్దీ

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. వైద్యం కోసం రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో వారికి మందులు ఇచ్చే కౌంటర్లు కూడా రద్దీగా ఉంటున్నాయి. గత మూడు రోజుల నుంచి మందులు ఇచ్చే కౌంటర్లు రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతున్నాయి. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని కేజీహెచ్ సూపరింటెండెంట్, కలెక్టర్ గతంలో కౌంటర్లు పెంచారు. ఓపీ విభాగంలో మూడు కౌంటర్లు, ఆంధ్రా బ్యాంక్ పక్కన అయిదు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధునీకీకరించారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కేజీహెచ్ సిబ్బందికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఫార్మాసిస్టులతో కౌంటర్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ గత మూడు రోజులుగా అన్ని కౌంటర్లూ కిటకిటలాడుతున్నాయి. ఇక్కడి ఆస్పత్రికి ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళంతోపాటు ఒడిశా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. మందుల కోసం రోజు వారీ రోగులే కాకుండా పాత రోగులు కూడా చీటీలు తీసుకొని కౌంటర్లకు వస్తుండడంతో రద్దీ ఎక్కువగా వుంది.

29న జాతీయ లోక్ అదాలత్

గాజువాక: జాతీయ న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.షణ్ముఖరావు తెలిపారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న ఈ అదాలత్‌లో అన్ని రకాల బ్యాంకు కేసులు, విద్యుత్, నీరు, టెలిఫోన్, యుటిలిటీ తగాదాలు, క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, పెట్టీ కేసులు, మున్సిపల్ వివాదాలు, పెండింగ్‌లో ఉన్న, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీమార్గంలో పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కేజీహెచ్‌లో షెడ్డు ప్రారంభం నేడు



కేజీహెచ్‌లో రోగుల సహాయకుల కోసం నిర్మించిన షెడ్డు లోపలి భాగం

మహారాణిపేట: కేజీహెచ్‌లో పిల్లల వార్డు వద్ద రోగుల సహాయకుల కోసం రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును గురువారం ప్రారంభించనున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు పడే ఇబ్బందులు చూసిన అప్పటి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున షెడ్డు నిర్మాణానికి సహకారం అందించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల నుంచి వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల సంస్థ ఏఈ నాయుడు ఆధ్వర్యంలో షెడ్డు నిర్మించారు. కేజీహెచ్‌లో ఇప్పటి వరకు పలు వార్డుల్లో రోగుల సహాయకుల కోసం 10 షెడ్లు నిర్మించారు. ఇప్పుడు పిల్లల వార్డు వద్ద 11వ షెడ్డు నిర్మించారు. ఈ షెడ్డును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ప్రారంభిస్తారని కేజీహెచ్ సూపరింటెంటెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాల్గొంటారని తెలిపారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్

పెదగంట్యాడ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. జీవీఎంసీ 65వ వార్డులోని ఇండోర్ స్టేడియంతో పాటు 76వ వార్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో కొత్తగా చేపట్టిన పార్కు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై ఆరా తీశారు. పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఏయే పనులు చేస్తున్నారో నిశితంగా చూశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇండోర్ స్టేడియం లోపల సీలింగ్, గచ్చులు, బయట ఎలివేషన్ పనులను గతంలోనే ప్రారంభించినా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత పనులు నిలిపివేశారు. కోడ్ అనంతరం పనులు పునఃప్రారంభం కావడంతో ఆ పనులను ఏడీసీ విశ్వనాథన్ స్వయంగా పరిశీలించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దన్నారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలో చేపట్టిన పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించినా, నాణ్యత పాటించకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడీసీ పర్యటనలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జీవీఎంసీ జోన్‌-6 జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, డీఈ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.